

అరుదుగా కనిపించే ఈ కప్ప పేరు ఇండియన్ బుల్. కప్పల్లో బాహుబలి లాంటిది. ఇది పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో సోమవారం కనిపించింది.

# కోట్లు దోచిన దొంగలను పట్టించిన ఫ్రీ డ్రింక్

చమోలి, జూన్ 19: సుమారు రూ.8.5 కోట్ల దోపిడీకి పాల్పడిన వారు ఆ సొమ్మును దర్జాగా అనుభవించాలని అనుకుంటారు. విలాసవంతంగా డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేస్తారు. లేకపోతే ఏ విదేశానికో చెక్కేస్తారు. కానీ దీనికి భిన్నంగా భారీ దోపిడీ చేసిన జంట కేవలం పది రూపాయల ఉచిత డ్రింక్ కోసం కక్కుర్తిపడి వచ్చి పోలీస్ ట్రాప్‌లో పడిన సంఘటన ఉత్తరాఖండ్‌లో చోటు చేసుకుంది. డాకూ హసీనాగా పేరుమోసిన మన్‌దీప్ కౌర్, ఆమె భర్తను రూ.8.49 కోట్ల భారీ దోపిడీ కేసులో పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే వీరిని పట్టుకోవడానికి పోలీసులు పెద్ద స్కెచ్చే వేశారు. ఈనెల 10న లుధియానాలోని సీఎంఎస్ సెక్యూరిటీస్‌లో డాకూ హసీనా, మరికొందరు కలిసి 8.49 కోట్ల నగదును అపహరించారు. ఈ కేసులో నిందితులు దొరికినా, దోపిడీ ప్రధాన సూత్రధారులు హసీనా, ఆమె భర్త తప్పించుకుపోయారు. మన్‌దీప్ కౌర్, ఆమె భర్త జస్విందర్ సింగ్‌లను ఎట్టకేలకు పోలీసులు ట్రాప్ చేసి ఉత్తరాఖండ్‌లోని హేమ్‌కుండ్‌లో పట్టుకున్నారు. వారి నుంచి 21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దోపిడీ తర్వాత నేపాల్‌కు పారిపోదామనుకున్న ఈ దంపతులు ముందుగా పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకున్నారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందినా, అంతమందిలో వారిని పట్టుకోవడమెలా అని ఆలోచించి భక్తులకు ఉచితంగా డ్రింక్‌ను పంపిణీ చేసే స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆ ఉచిత డ్రింక్‌ను తాగడానికి వచ్చిన హసీనా దంపతులను పోలీసులు అరెస్ట్ చేసి పంజాబ్‌కు తరలించారు.

## మా నాయకుడి సభకు రానంటారా?

### దంపతులపై బీజేపీ కార్యకర్త దాడి

న్యూఢిల్లీ, జూన్ 19: మా నాయకుడి మీటింగ్‌కు పిలిస్తే, రానంటావా? అంటూ అస్సాంలో ఓ దంపతులపై బీజే పీ కార్యకర్త విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. శివసాగర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధిత దంపతులు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మీటింగ్‌కు రావాలని గౌరీసాగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త అంగుశ్‌మన్ బోరా వారిపై ఒత్తిడి చేశారు. దంపతులు నిరాకరించడంతో చితక్కొట్టాడు.

## కుక్కలా మొరుగు!

భోపాల్, జూన్ 19: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణ ఘటన చోటుచేసుకొన్నది. కొందరు ఓ వ్యక్తి మెడకు బెల్ట్ కట్టి, కుక్కలా అరవాలంటూ.. అమానవీయంగా ప్రవర్తించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతున్నది. కొంతమంది బాధితుడి మెడకు బెల్ట్ కట్టి వేధించడం కనిపించింది. అతనిపై గట్టిగా అరుస్తూ.. 'కుక్కలా ప్రవర్తించు. సాహిల్ భాయ్‌కు క్షమాపణలు చెప్పు' అనే మాటలు వినిపించాయి. కాగా, ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల ఇండ్లను అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు.

# కేసీఆరే సమర్థ సారథి

## దేశాన్ని, కూటమిని నడిపించగల సత్తా ఉన్న నేత

**దేశానికి దిక్సూచిగా తెలంగాణ • అన్ని రంగాల్లోనూ ముందంజ**
**బీజేపీ ఓటమే విపక్షాల ఏకైక లక్ష్యం • కూటమి ఏర్పాటుకు అన్ని పార్టీల సుముఖత**
**ప్రాంతీయ పార్టీలకు ప్రాధాన్యమివ్వాలి • బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు**



న్యూఢిల్లీ, జూన్ 19: దేశాన్ని, విపక్షాల కూటమిని నడిపించేందుకు రథసారథిగా తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమర్థుడని, ఆయన్ను మించిన నాయకుడు మరొకరు లేరని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు తేల్చిచెప్పారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, దేశానికి దిక్సూచిగా మారిందని ఆయన అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఓటమే ఏకైక లక్ష్యంగా విపక్షాలన్నీ ఏకమవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. విపక్షాల కూటమి ఏర్పాటుకు అన్ని పార్టీలు సుముఖత చూపుతున్నాయని, చిన్నచిన్న అభిప్రాయ భేదాలు ఉన్నాయని, అవి కూడా సర్దుకుంటాయని తెలిపారు. ప్రాంతీయ పార్టీలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చినప్పుడే విపక్షాల ఐక్యత ఫలిస్తుందని చెప్పారు. బీజేపీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజలను కూటమిలో భాగస్వాములను చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దన్న మనస్తత్వాన్ని వీడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ది స్టేట్స్‌మ్యాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విపక్ష కూటమి ఏర్పాటు గురించి ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని మట్టికరిపించేందుకు అన్ని పార్టీలు భిన్నత్వంలో ఏకత్వంలా కలిసి ఉండేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పార్లమెంటులో భాగమైన రాష్ట్రపతిని ప్రారంభోత్సవ కార్యక్రమంలో విస్మరించడం అంటే రాజ్యాంగాన్ని విస్మరించడమేనని పేర్కొన్నారు. రాష్ట్రపతికి ఓటు వేయలేదని, ఆమె గురించి మాట్లాడే హక్కు లేదని బీజేపీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంట్‌ను బహిష్కరించలేదన్న విషయాన్ని బీజేపీ గ్రహించాలని సూచించారు.

**బీజేపీని గద్దె దించేందుకు ప్రజా ఉద్యమం...**

కాంగ్రెస్ కూడా విపక్ష పార్టీలలో ఓ పక్షం మాత్రమేనని ఆ పార్టీకి ప్రత్యేక ప్రాధాన్యత ఏమీ లేదన్నారు. సీఎంలు కేసీఆర్, మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్ తమ వాదనలను బలంగా వినిపిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కేసీఆర్ అజేయుడని పునరుద్ఘాటించారు. బలపడుతున్న ప్రతిపక్షాల ఐక్యతే మోదీ పీఠం దిగిపోవాలి అనే నినాదానికి సూచిక అని పేర్కొన్నారు. 60వ దశకం చివర్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం పురుడుపోసుకున్నట్టే... ప్రస్తుతం బీజేపీయేతర అంశం ప్రజల ఎజెండాగా మారిందన్నారు. తెలంగాణ తనకంటూ ఓ బ్రాండ్‌ను సృష్టించుకున్నదని తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ మాడల్ దేశానికి సూచికగా నిలుస్తున్నదని, గతంలో వెనకబడిన ప్రాంతంగా ఉన్న తెలంగాణ నేడు దేశంలో ధనిక రాష్ట్రంగా అవతరించిందని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా 3.5 లక్షల తలసరి ఆదాయం కలిగి ఉన్నదని చెప్పారు. రైతులకు ఉచిత కరెంటు, ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నదన్నారు. ఆరోగ్య రంగంలో ఘనమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అన్నీ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ దేశానికి అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చూపిస్తున్నారన్నారు. గతంలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మొదలైనట్టే ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతున్నదని తెలిపారు.



## బీజేపీ ఓటమికి విపక్షాలు ఏకం

రాంచీ, జూన్ 19: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని లౌకిక, ప్రజాస్వామిక పార్టీలు ఏకం అవుతున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా అన్నారు. సోమవారం ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, బీజేపీని కూకటివేళ్లతో సహా పెకిలించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. విపక్షాలు ఏకమయ్యే కార్యక్రమం వేగం పుంజుకొన్నదని అన్నారు. ఈనెల 23న బీహార్‌లోని పాట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరుగనున్నదని తెలిపారు.



## 'రా' చీఫ్‌గా రవిసిన్హా

న్యూఢిల్లీ, జూన్ 19: 'రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్' (రా) చీఫ్‌గా ఐపీఎస్ అధికారి రవి సిన్హా నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 1988 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయనను రా చీఫ్‌గా నియమిస్తూ కేంద్ర క్యాబినెట్ కమిటీ సోమవారం ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం ఆయన 'రా'లో సెకండ్ ఇన్ కమాండ్‌గా ఉన్నారు. రవి సిన్హా 'రా' చీఫ్‌గా రెండేండ్లపాటు కొనసాగనున్నారు. ప్రస్తుత చీఫ్ గోయెల్ పదవీ కాలం జూన్ 30తో ముగియనున్నది.

# గీతాప్రెస్‌కు శాంతి బహుమతిపై దుమారం

- ఇంతకుమించి పరిహాసం ఉండదన్న కాంగ్రెస్
- కాంగ్రెస్ నుంచి ఇంకేమీ ఆశిస్తామన్న బీజేపీ
- రూ.కోటి వద్దంటున్న గీతాప్రెస్




న్యూఢిల్లీ: దేశంలోని ప్రతిష్ఠాత్మక గీతాప్రెస్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని జ్యూరీ 2021కి గాను గాంధీ శాంతి బహుమతి ప్రకటించడం రాజకీయంగా దుమారం రేపుతున్నది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ రెండూ ఒకదానిపై ఒకటి దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. గీతాప్రెస్‌కు శాంతి బహుమతి ఇవ్వడమంటే హిందూత్వవాది సావర్కర్‌కు, గాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేకు ఇవ్వడమేనంటూ కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కాంగ్రెస్‌పై ఇంకా మావోయిస్టు ప్రభావం ఉందని బీజేపీ విమర్శించింది. రామమందిర నిర్మాణానికి అడ్డంకులు సృష్టించిన వారి నుంచి, ట్రిపుల్ తలాక్‌పై నిషేధాన్ని వ్యతిరేకించిన వారి నుంచి ఇంతకుమించి ఏం ఆశిస్తామని పేర్కొన్నది. గీతా ప్రెస్‌కు అవార్డును ప్రకటిస్తే విమర్శించడం కంటే సిగ్గుచేటు ఇంకేముంటుందని మండిపడింది. మహాత్మాగాంధీకి, గీతా ప్రెస్‌కు మధ్య విభేదాలు ఉన్నాయంటూ గీతా ప్రెస్‌పై 2015లో పాత్రికేయుడు అక్షయముకుల్ రాసిన పుస్తకాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ గుర్తుచేశారు. అలాంటి ప్రెస్‌కు గాంధీ శాంతి పురస్కారం ఏమిటని నిలదీశారు. ముస్లింలీగ్‌ను సెక్యులర్ సంస్థగా పరిగణించే కాంగ్రెస్‌కు తప్ప గీతా ప్రెస్‌కు అవార్డు విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు.

**1923లో ప్రారంభం**

జయదయాళ్ గోయంకా, ఘన్‌శ్యామ్‌దాస్ జలన్ కలిసి 1923లో గోరఖ్‌పూర్‌లో గీతా ప్రెస్‌ను స్థాపించారు. ఇప్పటి వరకు 14 భాషల్లో 41.7 కోట్ల పుస్తకాలను ఇది ప్రచురించింది. ఇందులో 16.21 కోట్ల భగవద్గీత పుస్తకాలున్నాయి. పురస్కారంతో పాటు కేంద్రం అందించనున్న రూ. కోటి నగదు బహుమతిని స్వీకరించేందుకు గీతా ప్రెస్ తిరస్కరించింది. ఈ మొత్తాన్ని మరో కార్యక్రమానికి ఉపయోగించుకోవాలని సూచించింది.

## హిందూ మహిళా ఎస్ఐ అదృశ్యం

### ముస్లిం వ్యక్తితో వివాహానికి అనుమతించాలని దరఖాస్తు

న్యూఢిల్లీ: యూపీలోని బరేలి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న ఓ హిందూ మహిళ.. కొద్ది రోజులుగా అదృశ్యమైంది. ఆమె హఠాత్తుగా శుక్రవారం బరేలి మేజిస్ట్రేట్ ముందు ప్రత్యక్షమైంది. తాను ఒక ముస్లిం యువకుడిని పెండ్లి చేసుకోబోతున్నానని, తమ వివాహానికి ప్రత్యేక వివాహ చట్టం కింద అనుమతి ఇవ్వాలని కోరింది. దీనిపై బరేలి పోలీసులు మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న 50 ఏండ్ల మహిళ ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు రావడం మానేసిందని తెలిపారు. తన సోదరి అదృశ్యానికి 30 ఏండ్ల ముస్లిం వ్యక్తే కారణమంటూ ఆమె సోదరుడు ఫిర్యాదు చేశాడని పోలీసులు చెప్పారు. తన సోదరిని అతను మోసగించి, బ్లాక్‌మెయిల్ చేసి వివాహానికి ఒప్పించాడన్నారు.



## కెనడాలో ఖలిస్థాన్ నేత కాల్చివేత

చండీగఢ్: భారత్‌లో మోస్ట్ వాంటెడ్ లిస్టులో ఉన్న ఖలిస్థాన్ నేత, కెనడాలోని ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్‌సింగ్ నిజ్జర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. కెనడా సర్రే సిటీలో బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లో గురునానక్ సిక్కు గురుద్వారా వద్ద సాయుధులైన ఇద్దరు వ్యక్తులు అతడిని హతమార్చారు. కారులో ఆదివారం బుల్లెట్ గాయాలతో పడి ఉన్న ఆయన మృతదేహాన్ని కనుగొన్నారు. పంజాబ్‌లోని జలంధర్‌కు చెందిన నిజ్జర్ కెనడాలో ఉంటూ ఖలిస్థాన్ వాదాన్ని ప్రచారం చేయడమే కాక, భారత్‌లో టెర్రరిస్టు కార్యకలాపాలకు నేతృత్వం వహిస్తున్నాడు.

## మూషికాలపై వాషింగ్టన్ దండయాత్ర

వాషింగ్టన్, జూన్ 19: రోజురోజుకు పెరిగిపోతున్న ఎలుకల బెడదపై అమెరికాలోని వాషింగ్టన్ వాసులు దండయాత్ర ప్రారంభించారు. ఇటీవల పలు కారణాలతో నగరంలో మూషిక సంతతి ఎక్కువైంది. వీటి నిర్మూలనకు పౌరులు నూతన విధానాలను కాదని, ప్రాచీన పద్ధతులు అవలంబించడం విశేషం. నగరవాసులు గ్రూపులుగా ఏర్పడి తమతో పాటు కుక్కలు, పిల్లులను వెంటేసుకుని ఎలుకల సంహారానికి బయలుదేరుతున్నారు. మరికొందరు వారాంతాలను ఈ మూషిక సంహారానికి కేటాయిస్తున్నారు. పొరుగు రాష్ర్టాల నుంచి సైతం వచ్చిన చాలామంది ఈ గ్రూపుల్లో చేరి ఎలుకల వధకు సహకరిస్తున్నారు. కొన్ని శునక జాతులను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా వినియోగిస్తున్నారు. తమకంటే పెంపుడు కుక్కలే ఎలుకలను వేగంగా పట్టుకుంటున్నాయని కొందరు నగరవాసులు సంబరపడుతున్నారు.

# మణిపూర్ కీ బాత్ వినండి

- ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'ను బహిష్కరించిన మణిపూర్ ప్రజలు
- రేడియోలు పగులకొట్టి నిరసన
- ప్రధాని మోదీ నోరు విప్పాలి
- రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలి
- కేంద్రానికి విపక్షాల డిమాండ్



మన్ కీ బాత్‌లో మణిపూర్ గురించి ప్రధాని మోదీ మాట్లాడనందుకు రేడియోలను పగలగొట్టిన అక్కడి ప్రజలు

న్యూఢిల్లీ/పాట్నా/ఇంఫాల్, జూన్ 19: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత నెలన్నర రోజులుగా కొనసాగుతున్న హింసాకాండపై ప్రధాని మోదీ నోరు మెదపకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మోదీ మౌనానికి నిరసనగా మణిపూర్ వాసులు ఆదివారం ఆయన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఇంఫాల్ వెస్ట్, కక్చింగ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో రేడియోలను రోడ్లపై పగులకొట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తమ మన్‌కీ బాత్ వినాలని పౌరులు డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పెద్దయెత్తున నినాదాలు చేశారు. ''సిగ్గుపడండి మోదీజీ, మన్‌కీ బాత్‌లో మణిపూర్ గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు', 'నో టు మన్‌కీ బాత్, యస్ టు మణిపూర్ కీ బాత్', 'మోదీజీ మన్‌కీబాత్ పేరుతో డ్రామాలొద్దు'' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

**మండిపోతుంటే.. ఒక్క మాట మాట్లాడరా?**

'మన్‌కీ బాత్' అంటూ ఊదరగొట్టే ప్రధాని మోదీ.. 'మణిపూర్ కీ బాత్' వినాలని, రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులు నెలకొల్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ ఘర్షణలతో మండిపోతుంటే.. మోదీ విదేశీ పర్యటనలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. హింసాకాండ మిజోరం రాష్ట్రానికి పాకుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వివాదం కొనసాగాలని ప్రధాని మోదీ, బీజేపీ కోరుకుంటున్నట్టు అనిపిస్తున్నదని ఆరోపించారు.

**మణిపూర్‌పై ఎప్పుడు మాట్లాడుతారు?**

మన్‌కీ బాత్‌లో మణిపూర్ అంశాన్ని ప్రస్తావించకపోవడాన్ని జేడీయూ జాతీయ అధ్యక్షుడు లలన్ సింగ్ ఖండించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ మణిపూర్ ఘర్షణలతో అట్టుడుకిపోతున్నదన్నారు. ఇంఫాల్ పశ్చిమలో సోమవారం ఆర్మీ జవాన్‌కు గాయాలయ్యాయి. చిన్‌మాంగ్‌లో దుండగులు మూడు ఇండ్లకు నిప్పు పెట్టారు.

## ఐఐటీ మద్రాస్‌కు అ'పూర్వ' కానుక

### రూ. 231 కోట్ల విరాళాలు

హైదరాబాద్ సిటీబ్యూరో/చెన్నై, (నమస్తే తెలంగాణ) : ఐఐటీ మద్రాస్‌కు పూర్వ విద్యార్థులు, ఇతర దాతలు, కార్పొరేట్ సంస్థలు అనూహ్య రీతిలో భారీస్థాయిలో విరాళాల రూపంలో సాయం అందించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను ఏకంగా రూ.231 కోట్ల నిధులను సమకూర్చారు. సామాజిక బాధ్యతగా సంబంధిత ప్రాజెక్టులను అమలు చేయడం కోసం ఏటా ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చే నిధుల కంటే భారీ మొత్తంలో విరాళాలను అందించారు. 2020-21లో రూ.101.2 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.131 కోట్లు, 2022-23 గాను రూ.231 కోట్ల సమకూర్చినట్లు ఐఐటీ మద్రాస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 2022-23లో విరాళాలు 76 శాతం పెరిగాయి. రూ.కోటి కంటే ఎక్కువ విరాళం ఇచ్చిన దాతల సంఖ్య 64 శాతం పెరిగిందని విద్యాసంస్థ తెలిపింది. పూర్వ విద్యార్థులు, దాతలు, కార్పొరేట్ సంస్థల నుంచి అందిన విరాళాలను మౌలిక వసతుల కల్పన, స్కాలర్ షిప్‌లు, రీసెర్చ్ ఫండ్‌కు వినియోగించనున్నట్టుగా విద్యాసంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

## రాజస్థాన్, సిక్కిం, చెన్నైలో వర్షాలు

### అస్సాంలో రెడ్ అలర్ట్




న్యూఢిల్లీ, జూన్ 19: ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో చెన్నై, రాజస్థాన్, అస్సాం, సిక్కింలలో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. రాజస్థాన్‌లో ఐదుగురు మృతి చెందగా, అస్సాంలో 35 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జోర్హాట్ జిల్లాలో బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నది. మరో మూడురోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీచేసింది. భారీ వర్షంతో చెన్నై తడిసిముద్దయింది. విమానాశ్రయం రన్‌వే పైకి నీరు చేరటంతో, పలు విమానాలు రద్దయ్యాయి. సిక్కిం పశ్చిమ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి 100 ఇండ్లు ధ్వంసమయ్యాయి. సింఫోక్‌లో పలు వంతెనలు వరదనీటిలో కొట్టుకుపోయాయి. రాజస్థాన్‌పై బిపర్‌జాయ్ ప్రతాపం చూపుతున్నది. గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో ప్రజలు బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. వందలాది గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

## ఆన్‌లైన్ వల..మహిళ సేవింగ్స్ ఖాళీ

లండన్, జూన్ 19: డేటింగ్ యాప్‌లో పరిచయమైన వ్యక్తి తియ్యటి మాటలు చెప్పి ఓ మహిళను వంచించి ఆమె దాచుకున్న సేవింగ్స్ మొత్తాన్ని ఖాళీ చేశాడు. దీంతో బాధిత మహిళ లండన్ పోలీసులను ఆశ్రయించింది. టిండర్ అనే డేటింగ్ యాప్‌లో లండన్‌కు చెందిన రెబెక్కా హలోవే అనే 42 ఏండ్ల మహిళకు ఫ్రెడ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ముఖాముఖీ కలవకపోయినా చాలాసార్లు అతనితో వీడియో కాల్ మాట్లాడేది. తన ముఖం చూపడానికి మాత్రం అతను విముఖత ప్రదర్శించేవాడు. రోజూ చాటింగ్ చేయడంతో వారి బంధం బలపడి అతడిని పూర్తిగా నమ్మడం ప్రారంభించింది. క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల ద్వారా తాను బాగా సంపాదిస్తున్నానని, ఆమె కూడా పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తం వస్తుందని నమ్మబలికాడు. దీంతో ఆమె తొలుత స్వల్ప మొత్తంలో పెట్టింది. వాటిపై అధిక రిటర్న్‌లు వచ్చినట్టు యాప్‌లో కన్పించింది. తర్వాత సుమారు 81 లక్షల రూపాయలను అతను చెప్పిన ఖాతాలోకి బదిలీ చేసింది. తర్వాత అతను ముఖం చాటేయడంతో తాను మోసపోయానని తెలిసి పోలీసులను ఆశ్రయించింది.

# అభివృద్ధి పేరుతో ఓంకారేశ్వర్ అపవిత్రం!

**హైకోర్టు స్టే విధించినా.. ఆగని 'ఏకత్వ' విగ్రహ పనులు**
**పిక్నిక్ స్పాట్‌గా మార్చొద్దన్నా వినని మధ్యప్రదేశ్ సర్కారు**
**ఎన్నికలే లక్ష్యంగా హడావుడిగా పనుల పూర్తికి ఆరాటం**


డబుల్ ఇంజిన్ ట్రబుల్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఓంకారేశ్వర క్షేత్ర పవిత్రతను దెబ్బ తీయడానికి బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకొన్నది. మధ్యప్రదేశ్‌లోని మాంధాత పర్వతంపై 'స్టాట్యూ ఆఫ్ వన్‌నెస్' (ఏకత్వ విగ్రహం) ఏర్పాటు పనులపై విమర్శలు వ్యక్తమవుతున్నప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పూర్తి చేస్తున్నది. గత జూలైలో ఈ ప్రాజెక్టుపై మధ్యప్రదేశ్ హైకోర్టు స్టే విధించింది. ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పిక్నిక్ స్పాట్‌గా మార్చవద్దని స్థానిక సనాతన ధర్మ గురువులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినా వీటిని శివరాజ్ సింగ్ చౌహాన్ సర్కారు చెవికెక్కించుకోవట్లేదు.

**ప్రజలు వద్దన్నా కొండను తొలుస్తూ..**

మధ్యప్రదేశ్‌లో మూడేండ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి దొడ్డిదారిన గద్దె నెక్కిన బీజేపీకి ఈ నవంబర్‌లో జరిగే ఎన్నికలు సవాల్‌గా మారాయి. అభివృద్ధి కార్యాచరణలో దారుణంగా విఫలమైన కమల దళానికి ఎన్నికల వేళ మళ్లీ మతం గుర్తుకు వచ్చింది. దీంతో ఆరేండ్ల కిందట ప్రకటించిన ఏకత్వ విగ్రహం పనులను మళ్లీ ముందేసుకొన్నది. 108 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి 2017లో శివరాజ్‌సింగ్ సర్కారు నిర్ణయించింది. దీంతోపాటు ఏకాత్మ ధామ్, అద్వైత లోక్ మ్యూజియమ్, ఇన్ఫర్మేషన్ సెంటర్, లేజర్ షో, నౌకా విహార్, వేదిక్ గురుకుల్, రెస్టారెంట్స్ కూడా నిర్మించతలపెట్టింది. దీని కోసం ఏకంగా రూ. 2,141 కోట్లను కేటాయించింది. అయితే విగ్రహ ప్రతిష్ఠకు మాంధాత పర్వతాన్ని ఎంపిక చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. మాంధాత పర్వతంపై శివుడు సశరీరంగా నడయాడాడని ప్రతీతి. అందుకే ఈ పర్వతానికి, దాని పవిత్రతకు ఎలాంటి విఘాతం కలుగకుండా, వేరేచోట విగ్రహ ప్రతిష్ఠ చేయాలని హిందూ ధార్మికవేత్తలు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రాజెక్టును వేరే ప్రాంతంలో చేపట్టాలని ఇప్పటికే పలు ఎన్జీవోలు 50 వేల మందితో సంతకాలు తీసుకొన్నాయి. దీంతో ప్రాజెక్టు పనులపై కోర్టు కూడా స్టే విధించింది. అయితే, ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం బుల్డోజర్లతో పవిత్రమైన మాంధాత గిరిని తొలుస్తున్నది. 'రాజకీయ ప్రయోజనాలకు జ్యోతిర్లింగం కొలువైన ఈ పవిత్ర స్థలాన్ని పిక్నిక్ స్పాట్‌గా మారుస్తారా?' అంటూ లోక్‌హిత్ జన్‌వాదీ సమితి న్యాయవాది త్రిపతి ధ్వజమెత్తారు.





### రాజకీయ ప్రయోజనాలకు ఇలా చేయొద్దు

హిందువులు పరమ పవిత్రంగా భావిస్తున్న మాంధాత పర్వతాన్ని బుల్డోజర్లతో తవ్వడం సరికాదు. హిందూ పక్షపాత పార్టీగా చెప్పుకొనే బీజేపీ.. రాజకీయ ప్రయోజనాలకు ఇలా చేయడం దారుణం.

– మునీందర్ దాస్ కబీర్, మత గురువు, మాంధాత క్షేత్రం

### ప్రాజెక్టు వివరాలు సంక్షిప్తంగా

- విగ్రహం పేరు: స్టాట్యూ ఆఫ్ వన్‌నెస్
- విగ్రహం ఎత్తు: 108 అడుగులు
- ప్రతిష్ఠించనున్న ప్రాంతం: ఓంకారేశ్వర పర్వతం
- విగ్రహానికి ఖర్చు: రూ. 200 కోట్లు
- విగ్రహం ప్రారంభం: సెప్టెంబర్, 2023
- మిగతా ప్రాజెక్టు ప్రారంభం: 2026





## బంగారు తాపడంతో మాకు సంబంధం లేదు

### కేదార్‌నాథ్ ఆలయ కమిటీ

కేదార్‌నాథ్, జూన్ 19: బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్‌లో బంగారు తాపడం ఏర్పాటులో అవినీతి జరిగిందని వస్తున్న ఆరోపణలను ఆలయ కమిటీ ఛైర్మన్ అజేంద్ర అజయ్ ఖండించారు. రాజకీయ కుట్రలో భాగంగా ఆరోపణలు వస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. బంగారు తాపడం పనులతో తమకేమీ సంబంధం లేదన్నారు. దాత తన వ్యక్తిగత స్వర్ణకారుల సాయంతో తాపడం పనులు చేయించారని చెప్పారు. పురావస్తు శాఖకు చెందిన నిపుణులు పనులను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. సంబంధిత బిల్లులు సైతం దాత తన వ్యక్తిగత స్వర్ణకారుడి ద్వారానే సమర్పించినట్టు ఆయన పేర్కొన్నారు.